# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 16, ఆగస్టు 2026


## గోదావరి నదిలో మునిగి మేడ్చల్ యువకుడు మృతి

**భైంసా, ఆగస్టు 15, ప్రభాతవార్త:**



తాత అస్థికల నిమజ్జనానికి వచ్చి ప్రమాదవశాత్తు గోదావరి నదిలో కాలు జారి పడి ఓ యువకుడు మృతి చెందిన విషాద ఘటన బాసరలో చోటుచేసుకుంది. బాసర ఎస్‌హెచ్‌ఓ దీపక్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన శ్రీవత్స క్రిష్ తాత శుక్రవారం మృతి చెందాడు. అంత్యక్రియలు పూర్తి చేసిన అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి అస్థికలు నిమజ్జనం చేయడానికి బాసర గోదావరి నదికి వచ్చారు. అస్థికలు నిమజ్జనం చేస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి శ్రీవత్స క్రిష్ నదిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టి శనివారం ఉదయం మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.





## దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి...



❖ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్

❖ ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 15, ప్రభాతవార్త :**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఏఆర్ హెడ్ క్వార్టర్ ఆవరణలో నిర్వహించిన స్వాతంత్ర వేడుకల్లో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వందేమాతరం గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ నితికా పంత్ ఎమ్మెల్సీ దండే విట్టల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అడిషనల్ కలెక్టర్లు యువరాజ్ మార్మాట్, డేవిడ్, ఏ ఎస్పీ చిత్త రంజన్, గ్రంధాలయం శాఖ జిల్లా చైర్మన్ అనిల్, మున్సిపల్ చైర్మన్ ఆకాష్, మార్కెట్ కమిటి చైర్మన్ మంగతో కలసి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ జాతీయ పతకంను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ, రాష్ట్రీయ గీతాలాపనతో దేశభక్తిని చాటారు. ప్రధాన వేదిక వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధి కుమురం భీం జిల్లా అభివృద్ధిపై సందేశంను అందించారు. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే మిగతా 2లో..

## నిర్మల్ జిల్లాలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**నిర్మల్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**

జిల్లా వ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా, దేశభక్తి ఉట్టిపడేలా జరిగాయి. కలెక్టర్ క్యాంపు కార్యాలయం, సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు వేడుకలు కన్నుల పండుగగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయం, సమీకృత కార్యాలయాల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అధికారులకు, విద్యార్థులకు మిఠాయిలు అందజేసి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన ప్రధాన వేడుకలకు ప్రభుత్వ విప్ వేముల వీరేశం ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఆయన ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల పరేడ్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ, జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో మిగతా 2లో..



## ప్రజలకు భద్రతతో కూడిన స్మార్ట్ రేషన్‌కార్డులు

☆ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు



**నస్పూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త**

ప్రజలకు మరింత పారదర్శకంగా, అవకతవకలకు తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు క్యూఆర్ కోడ్ భద్రతతో కూడిన ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, కనీస వేతనాల బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, మిగతా 2లో..

# దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రజలకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతోందని, మహిళలు, పేదలు, గృహ వినియోగదారులు, విద్యుత్ వినియోగదారులు, వైద్య సేవలు అవసరమైన వారికి ప్రభుత్వం పలు పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. మహిళలు పైసా ఖర్చు లేకుండా రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని, ఈ పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 2.41 కోట్ల మంది మహిళా ప్రయాణికులు లబ్ధి పొందగా, వారికి రూ.88.5 కోట్ల విలువైన ఉచిత ప్రయాణ సౌకర్యం అందిందన్నారు. జిల్లాలో 78,467 కుటుంబాలకు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందించే పథకం అమలవుతోందని, ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా రూ.8.32 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నామని, దీంతో జిల్లాలో సుమారు 83,684 కుటుంబాలకు రూ.55 53 కోట్ల మేర విద్యుత్ ప్రయోజనం అందినట్లు అధికారులు తెలిపారన్నారు. ధర్తి ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద జిల్లాలో 982 పేద గిరిజన కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు 738 అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం అందించినట్లు వెల్లడించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 202526 ఆర్థిక సంవత్సరంలో 8,396 మందికి వైద్య చికిత్సలు అందించగా, ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.2,19,98,569 ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారని వెల్లడించారు. ప్రజలకు అందిస్తున్న పలు ప్రభుత్వ శాఖల సంక్షేమ పథకాలకు చెందిన శకటాల ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నాయి. జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృుతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బంది, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పురస్కారాలు అందజేశారు. అనంతరం పలు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాళ్ళను ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి వాతావరణంలో ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ దాసరి వేణు, ఆర్డిఓ లోకేశ్వర్ రావ్, డి.ఎస్.పి అశోక్, జిల్లాలోని పలు శాఖల అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లాలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

పనిచేయాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, శకటాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబన కోసం రూ.50 కోట్ల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఏఎస్పి సాయి కిరణ్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజలకు భద్రతతో కూడిన స్మార్ట్ రేషన్‌కార్డులు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి బ్రహ్మారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానేష్ లతో కలిసి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు దూసుకెళ్తుందని తెలిపారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందని తెలిపారు. మంచిర్యాల జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ఈ విజయంలో జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల కృషి అభినందనీయమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, ఈ క్రమంలో మంచిర్యాల జిల్లాలో లబ్ధిదారులకు కార్డులు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.

పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ప్రజలకు ప్రాథమిక సౌకర్యాల కోసం ఇబ్బందులు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నామని, ర్యాంకింగ్‌లో 2వ స్థానంలో, విద్యార్థుల నమోదు విషయంలో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణం అని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1 కోటి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నామని, కొత్త సాంకేతికతతో రూపొందించిన ఈ కార్డుల ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఆరు గ్యారంటీల అమలులో స్మార్ట్ కార్డులు కీలకంగా మారనున్నాయని, రాష్ట్రంలో ప్రజాపాలన నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్యూఆర్ కోడ్‌తో కూడిన ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా 100 మంది లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులు ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తోందని, రైతులు పండించిన సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ అందిస్తుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో నూతనంగా 40 వేల 456 రేషన్ కార్డులు జారీ చేయడం జరిగిందని, రేషన్ కార్డు ద్వారా అర్హులైన లబ్ధిదారులు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. ప్రజలకు మరింత పారదర్శకంగా, సాంకేతికత ఆధారంగా సేవలు అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. అట్టడుగు వర్గాల ప్రజలకు ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రభుత్వ పథకాలు అందించేందుకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించడం జరిగిందని తెలిపారు. సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి కొనసాగింపుగా మంచిర్యాల జిల్లాలో 100 మంది లబ్ధిదారులకు కార్డులను అందించడం జరిగిందని, మండలాల వారీగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం రైతులకు, మహిళలకు ప్రాధాన్యతనిస్తూ వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని, మంచిర్యాల నియోజకవర్గంలో పంటల ఉత్పత్తి ఊహించని విధంగా పెరిగిందని, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. పెన్షన్లకు సంబంధించి వృద్ధాప్య పెన్షన్ మినహా ఇతర కేటగిరీలకు ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు జారీ చేయడమే కాకుండా ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రజలు, రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా, వేగంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. బెల్లంపల్లి శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా అర్హులకు అందజేయడంలో స్మార్ట్ రేషన్ కార్డులు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# మందమర్రి జీఎం కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 15,**
**ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా ఆవిష్కరణ, ప్లటూన్ వందనం, ఉత్తమ ఉద్యోగుల సన్మానం, విద్యార్థుల సాంస్కృుతిక కార్యక్రమాలతో కార్యాలయ ప్రాంగణంలో స్వాతంత్ర్య వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

### జాతీయ జెండా ఆవిష్కరణ...

వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, సేవాసమితి అధ్యక్షురాలు ఎన్. శ్రీవాణి రాధాకృష్ణతో కలిసి మహాత్మా గాంధీ, డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. సెక్యూరిటీ గార్డ్స్ (ఎస్ అండ్ పీసీ) ప్రదర్శించిన ప్లటూన్ వందనాన్ని జీఎం స్వీకరించారు.

### త్యాగాల ఫలితమే స్వాతంత్రం...

ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు చేసిన పోరాటాలు, ప్రాణత్యాగాల ఫలితంగానే నేడు ప్రతి ఒక్కరూ స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన భారతదేశంలో జన్మించడం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, మహిళా సిబ్బంది, ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

### దేశాభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర...

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోని విద్యుత్ ప్లాంట్లకు బొగ్గును సరఫరా చేస్తూ దక్షిణ భారతదేశంలో వెలుగులు నింపుతున్న సింగరేణి సంస్థ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని జీఎం తెలిపారు. సంస్థ డైవర్సిఫికేషన్‌లో భాగంగా విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి కూడా విజయవంతంగా అడుగుపెట్టిందన్నారు. సీఎండీ, డైరెక్టర్ల మార్గదర్శకత్వంలో అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా కృషి చేసి రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సింగరేణిని దేశంలోనే నంబర్‌వన్ సంస్థగా నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

### త్వరలో రామకృష్ణాపూర్ ఓపెన్‌కాస్ట్ ఫేజ్2...

రామకృష్ణాపూర్ ఓపెన్‌కాస్ట్ ఫేజ్2ను అతి త్వరలో ప్రారంభించనున్నట్లు జీఎం వెల్లడించారు. ఈ ప్రక్రియలో సహకరిస్తున్న ఎస్టేట్స్, ఫారెస్ట్, సర్వే విభాగాల అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. కొత్త ప్రాజెక్టు ప్రారంభంతో మందమర్రి ఏరియాలో ఉత్పత్తి సామర్థ్యం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ll మంది ఉత్తమ ఉద్యోగులకు సన్మానం...

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మందమర్రి ఏరియాలోని వివిధ గనులు, విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 11 మంది ఉత్తమ ఉద్యోగులను జీఎం ఎన్. రాధాకృష్ణ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఉద్యోగుల కృషిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా ఇతర సిబ్బందిలోనూ మరింత ఉత్సాహం పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

### విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి...

అనంతరం సింగరేణి హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, సాంస్కృుతిక కార్యక్రమాలు, బృంద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రదర్శనలు కార్యక్రమానికి హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సీఎంఓఏఐ అధ్యక్షులు ఎస్. రమేష్, డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, కేకే ఏజెంట్ ఖదీర్, శాంతిఖని ఏజెంట్ సంతోష్ కుమార్, ఏరియా గనులు, విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తితో సింగరేణి అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధిస్తూ సంస్థను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని జీఎం పిలుపునివ్వడంతో వేడుకలు ఘనంగా ముగిశాయి.



# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**సారంగాపూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ విజయ్‌కాంత్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎందరో మహానుభావుల ప్రాణ త్యాగాల ఫలితంగానే మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లభించాయన్నారు. వందల సంవత్సరాల పరాయి పాలన, బ్రిటీషర్ల గుప్పిటి నుంచి దేశానికి విముక్తి కలిగించేందుకు ఎందరో పోరాటాలు చేశారని స్మరించుకున్నారు. త్యాగధనుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ రెవెన్యూ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**లక్ష్మణచాంద, ఆగస్టు 15, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా చోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎందరో మహానుభావుల ప్రాణ త్యాగాల ఫలితంగానే మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లభించాయన్నారు. వందల సంవత్సరాల పాటు భారతదేశాన్ని పరిపాలించిన బ్రిటీషర్ల గుప్పిటి నుంచి దేశానికి విముక్తి కలిగించేందుకు పోరాడిన త్యాగధనులను స్మరించుకున్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**బజార్‌హత్నూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె. శ్యామ్ సుందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ప్రభుత్వం నూతనంగా జారీ చేస్తున్న స్మార్ట్ ఎఫ్ఎస్‌సీ (రేషన్ కార్డులను) మండలంలోని రేషన్ డీలర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన అందజేయాలని డీలర్లకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు, డీలర్లు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ హీరాలాల్, సర్వేయర్ బాపురావు, గిర్దావర్లు ఆర్. నూర్‌సింగ్, ఏఆర్ మహేందర్, జూనియర్ అసిస్టెంట్లు టి. రవి, స్రవంతి, జీపీఓలు ఎస్. అమోల్ కుమార్, గణేష్, రవీందర్, మెహరాజ్, కార్యాలయ సిబ్బంది, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## అక్కాపూర్ పాఠశాలకు టీవీ విరాళం

**నిర్మల్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**
నిర్మల్ మండల పరిధిలోని అక్కాపూర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల డిజిటల్ బోధన కోసం రూ. 25,000 విలువైన డిజిటల్ టీవీని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ మేనేజర్ ఏరెల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా పాఠశాలలో ఉచిత ట్యూషన్లు నిర్వహిస్తూ, విద్యార్థుల క్రీడా వికాసానికి కావలసిన పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమై, వారిలో నూతన ఆలోచనా శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు కడారి సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోకల రాజేశ్వర్, ఉప సర్పంచ్ సాయెల లక్షి  ్మ మల్లేష్, వార్డు సభ్యులు ఇప్ప పద్మ, పతాని లక్ష్మణ్, బొడ్డు లింగన్న, మమేడ గణేష్, వీడీసీ సభ్యుడు బైరి వెంకన్న, పిఏసిఎస్ చైర్మన్ బోడ్ల గంగాధర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పద్మ, గణపతి, నీల, వనజ, దేవి ప్రియ, జ్యోతి, సరిత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**జైనూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**
జైనూర్ మండల కేంద్రంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత ఘనంగా, దేశభక్తి ఉత్సాహాల నడుమ జరిగాయి. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం (తహశీల్దార్ కార్యాలయం) ప్రాంగణంలో వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. తహశీల్దార్ బిర్షావ్ జాతీయ జెండాను ఆవిష్కరించి, త్రివర్ణ పతాకానికి వందనం సమర్పించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యానికై ప్రాణాలర్పించిన సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ధ్యేయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అనంతరం అధికారులు, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

**జైనూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**
స్థానిక తెలంగాణ మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత ఉత్సాహంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపల్ సోఫియానాజ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రం కోసం మహాత్మా గాంధీ, భగత్ సింగ్, మోలానా అబుల్ కలామ్ ఆజాద్ వంటి మహనీయులు చేసిన త్యాగాలను విద్యార్థులకు వివరించారు. నేటి యువతే దేశ భవిష్యత్తు అని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

**చింతలమానేపల్లి, ఆగస్టు 15, ప్రభాతవార్త:**
మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండల తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, ఐకేపీ-వీఓఏ కార్యాలయాలు, అటవీ శాఖ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి, దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. అనంతరం పలుచోట్ల విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు సూచించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామ పంచాయతీల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి నినాదాలు, జాతీయ గీతాల మధ్య ఉత్సాహంగా సాగాయి. తహసిల్దార్ ప్రకాష్, ఎంపిడిఓ సత్యనారాయణ , డిటి దౌలత్, ఆర్ ఐ జాఫర్ అహ్మద్, మాజీ ఎంపీపీ డుబ్బుల నానయ్య, సర్పంచ్ మేకల పోశక్క, ఉప సర్పంచ్ టీ. శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ శ్రీదేవి వెంకన్న, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.















జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మార్వో ప్రకాష్

# స్వాతంత్ర సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివి

### - రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావు

**నస్పూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త**





భారతదేశ స్వాతంత్ర సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్‌లతో కలిసి హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతం, తెలంగాణ గీతాలాపనలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి సందేశాన్ని అందించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. జిల్లాలోని 892 స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన 100 కోట్ల 10 లక్షల రూపాయల బ్యాంకు లింకేజీ చెక్కును మంచిర్యాల జిల్లా సమాఖ్య సభ్యులకు అందజేశారు. పి.ఎం.ఎఫ్.ఎం.ఈ. పథకంలో 18 మంది లబ్ధిదారులకు 46 లక్షల 72 వేల 346 రూపాయల చెక్కును అందజేశారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. వేడుకలకు హాజరైన అధికారులు, ప్రముఖులు, మీడియా, ప్రజల కొరకు గ్యాలరీ, త్రాగునీరు, పారిశుద్ధం ఇతర కార్యక్రమాల ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేస్తున్న నిర్వాహకులు

## జెండా పండుగ వేళ.. విద్యార్థులకు చేయూత

### 50 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల అందజేత

**వేమనపల్లి, ఆగస్టు 15, ప్రభాతవార్త**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ముల్కలపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ధర్మాజ్ ఫౌండేషన్ రంజిత్, చెన్నూరు చెతన్ ట్రేడర్ జితేందర్ బజాజ్, తిరుమల ట్రేడర్ ముల్కలపేట పబ్బ సురేష్ సౌజన్యంతో సుమారు 50 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించడంతో పాటు పరీక్షలకు అవసరమైన సామగ్రి అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్య ప్రతి ఇంటికి చేరినప్పుడే ప్రతి ముఖంలో చిరునవ్వు కనిపిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, సర్పంచ్ ఒడిల కళ్యాణి, ఉప సర్పంచ్ బోర్కుటి నరేష్ పాల్గొన్నారు.



## యోగా పీఠ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సంబరాలు

### జాతీయ జెండా ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్న సభ్యులు

**మంచిర్యాల, ఆగస్టు15, ప్రభాతవార్త**

ఓం అష్టోత్తర యోగా పీఠ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెడ్డి కాలనీలో గురువు గుండా విజయకుమార్ ఆర్య నివాసంలో జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు. అనంతరం సభ్యులు పరస్పరం స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకుంటూ మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో యోగా పీఠ్ అధ్యక్షులు ముక్త వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కోడూరి శ్రీనివాస్, కోశాధికారి మల్యాల శ్రీపతి, గురూజీ గుండా విజయకుమార్ ఆర్యతో పాటు పలువురు యోగా పీఠ్ సభ్యులు పాల్గొన్నారు. దేశభక్తి, యోగాభ్యాసం, ఆరోగ్య పరిరక్షణతో సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

## తుకారం మృతి తీరని లోటు

### - జర్నలిస్టు, ఆర్ఎంపీ ఆత్రం తుకారం హఠాన్మరణం

**జైనూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**

జర్నలిజంలో సుదీర్ఘ సేవలు అందించడంతో పాటు ఆర్ఎంపీ వైద్యుడిగా ప్రజలకందించిన ఆత్రం తుకారం (58) హఠాన్మరణం ఆదివాసీ, పాత్రికేయ సమాజాలకు తీరని లోటని ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. సిర్పూర్ (యు) మండల కేంద్రానికి చెందిన తుకారం శుక్రవారం రాత్రి హఠాత్తుగా మృతి చెందారు. శనివారం సాయంత్రం ఆయన పార్థివదేహానికి పలువురు నాయకులు, జర్నలిస్టులు సందర్శించి సంప్రదాయబద్ధంగా నివాళులర్పించారు. తుకారం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యామ్ నాయక్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్‌రావు, జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు రవినాయక్, అబ్దుల్ రహమాన్, వివిధ మండలాల జర్నలిస్టులు, ఆదివాసీ సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు ఉన్నారు.



## నేడే మండల స్థాయిలో ప్రజావాణి

**సారంగాపూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం మండల స్థాయిలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 17న సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు సారంగాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మీకాంత్ మాట్లాడుతూ.. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరవుతారని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి

**లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ**

**మాజీ జడ్పీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి**

**సారంగాపూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లాలోని సోఫినగర్ రోడ్ భాగ్యనగర్ వద్ద లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ జిల్లా మాజీ జడ్పీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకానికి వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటీషర్ల పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు మహాత్మా గాంధీతో పాటు ఎంతోమంది మహనీయులు తమ జీవితాలను త్యాగం చేశారని స్మరించుకున్నారు. గాంధీజీ అహింస, సత్యాగ్రహం, శాంతి మార్గంలో నడిచి స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించారని తెలిపారు. యువత దేశభక్తి, సామాజిక బాధ్యతతో మెలగుతూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి దశరథ్ రాజేశ్వర్, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ, జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు అనుముల భాస్కర్, కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాకలి సురేందర్ పాల్గొన్నారు.



# మెకానిక్‌లను అసంఘటిత కార్మికులుగా గుర్తించాలి

### టూవీలర్ మెకానిక్ వర్క్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

**మంచిర్యాల, ఆగస్టు15, ప్రభాతవార్త**



మంచిర్యాల పట్టణంలో టూవీలర్ మెకానిక్ అండ్ వర్క్స్ సొసైటీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయగీతాన్ని ఆలపించి జాతీయ జెండాకు వందనం చేశారు.సొసైటీ అధ్యక్షులు కర్ణకంటి రవీందర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మెకానిక్‌లంతా ఐక్యంగా సంఘాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. వృత్తి నైపుణ్యంతో ద్విచక్ర వాహనాలను మరమ్మతులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న మెకానిక్‌లను ప్రభుత్వం అసంఘటిత కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మెకానిక్‌ల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వపరంగా అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నిర్వాహక కార్యదర్శి చిలుకూరి అంజన్న, ప్రధాన కార్యదర్శి రామగిరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మడుపు శ్రీనివాసచారి, పుట్ట రాజ్‌కుమార్, సీనియర్ సలహాదారులు మోసం సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరిత



జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్పీ నితికా పంత్



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

# రెపరెపలాడిన మువ్వెన్నెల జెండా.....

**ఆసిఫాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త :**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్, డిపిఓ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో కలెక్టర్ హరిత, ఎస్పీ నితికా పంత్, కోవ లక్ష్మి తో పాటు పలు శాఖల అధికారులు జాతీయ పతాకాలను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం, రెవెన్యూ, విద్య, వైద్య, వ్యవసాయ, పంచాయతీరాజ్, అటవీ తదితర ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమాల్లో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నారు.

**పెంచికల్ పేట్, ఆగస్ట్ 15, ప్రభాతవార్త :**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మండల కేంద్రంతో పాటు, గ్రామపంచాయతీలలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్, రక్షకభట నిలయంలో ఎస్సై అనిల్ కుమార్ తో పాటు వివిధ శాఖల కార్యాలయాలలో ఆయా శాఖల అధికారులు, గ్రామపంచాయతీలలో సర్పంచులు, పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు దేశ ప్రగతికి తోడ్పడాలని అధికారులు పేర్కొన్నారు. పాఠశాలల్లో చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

**సిర్పూర్ టి, ఆగస్టు 15, ప్రభాతవార్త:**

సిర్పూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సివిల్ కోర్ట్ న్యాయమూర్తి అజయ్ ఉల్లంకోర్టు ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తాసిల్దార్ కార్యాలయంలోతహసిల్దార్ రహీముద్దీన్ జెండాను ఎగరవేశారు.

**బెజ్జూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రామ్మోహన్ రావు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, పోలీస్ స్టేషన్లో ఎస్ఐ సర్తాజ్ పాషా, అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో ఎఫ్ఆర్ఓ శ్రావణ్ కుమార్, విద్యుత్ ఉపకేంద్రం వద్ద ఏఈ అంజన్ కుమార్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎందరో దేశభక్తుల త్యాగఫలం ఈరోజు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవం అని తహసిల్దార్ అన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండి దేశాభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, ఆశ్రమ పాఠశాల, వివిధ పాఠశాలల విద్యార్థులు దేశభక్తుల వేషాదరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అసాంతం వీనుల విందు కలిగించింది. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**కెరమెరి, ఆగస్టు 15 ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పోలీస్‌స్టేషన్, రాజకీయ పార్టీ కార్యాలయాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశభక్తి నినాదాలతో మండల కేంద్రం మార్మోగింది. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అంజాద్ పాషా, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగార్జున, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రియాన్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మహమ్మద్ సుజాహిత్ ఖాన్, గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెందూర్ ఆనంద్‌రావు, ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం ముక్తేశ్వర్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. విద్యార్థుల ర్యాలీస్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని వందేమాతరం, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులు ఉత్సాహంగా ముందుకు సాగారు. గ్రూమింగ్ బర్డ్స్ పాఠశాల విద్యార్థులు తిరంగజెండాతో ర్యాలీతో మండల కేంద్రంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఐక్యత, సౌభ్రాతృత్వంతో ముందుకు సాగుతూ దేశ ప్రగతికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**తాండూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త :**

మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం పంద్రాగస్టు వేడుకలు ఘనంగా జరిగాయి. తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి అంజయ్య, సీఐ కార్యాలయంలో సిఐ దేవయ్య, విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ శ్రీనివాస్, ఆయా సర్పంచులు, పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండా ఎగురవేశారు. ఈ వేడుకల్లో వివిధ పార్టీల నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



తిరంగతో రోడ్ షో నిర్వహిస్తున్న బ్లూమింగ్ బడ్స్ పాఠశాల విద్యార్థులు





జాతీయ పథకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్



జాతీయ పతాకాన్ని ఎగరేస్తున్న ఎంపీడీఓ



తిరంగా జెండాను ఆవిష్కరిస్తున్న తహసిల్దార్ నాగార్జున

# ఎందరో త్యాగధనుల పోరాట ఫలితమే నేటి స్వాతంత్ర్యం

**శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ - శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**







జెండా ఆవిష్కరిస్తున్న డీసీపీ

**నస్పూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త**

ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా మనకు స్వాతంత్రం సిద్ధించింది, స్వతంత్రంగా జీవించగలిగే హక్కు ప్రతి ఒక్కరికీ ఎంతో ముఖ్యమని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వేదికగా శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జీఎం మునిగంటి శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు ఉమారాణి జీఎం కార్యాలయానికి చేరుకోగా అధికారులు, సేవా సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు. సింగరేణి హైస్కూల్ స్కౌట్స్ అండ్ గైడ్స్, బ్యాండ్ పార్టీ, ఎస్ అండ్ పీసీ సిబ్బంది కవాతు అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వందేమాతరం గేయాలాపన తర్వాత మునిగంటి శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ గీతాలాపన అనంతరం ఎస్ అండ్ పీసీ విభాగం గౌరవ వందనం సమర్పించింది. దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థ కల్పించనన్ని సంక్షేమ పథకాలను సింగరేణి అమలు చేస్తూ ఉపాధి కల్పన కేంద్రంగా కొనసాగుతోందని జనరల్ మేనేజర్ తెలిపారు. సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి సారధ్యంలో, డైరెక్టర్ల పర్యవేక్షణలో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో సాధించేలా ముందుకు సాగుతున్నామని వివరించారు. కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా థర్మల్ పవర్, సోలార్, గ్యాసిఫికేషన్, గ్రీన్ ఎనర్జీ, ఇతర మైనింగ్ రంగాల వైపు కూడా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. రక్షణ విషయంలో శ్రీరాంపూర్ ఏరియా అగ్రగామిగా నిలుస్తోందని, 56వ వార్షిక భద్రతోత్సవాలలో 19 బహుమతులతో కంపెనీలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. ఫైవ్ స్టార్ రేటింగ్‌లో ఆర్.కె న్యూటెక్, ఆర్.కె 6 గనులు ఉత్తమ ప్రతిభ కనబరచడమే కాకుండా, 99 శాతం మార్కులతో ఆర్.కె న్యూటెక్ గని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచి జాతీయ స్థాయిలో ఏరియా సత్తా చాటిందని కొనియాడారు. కంపెనీ స్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా ఎంపికై కొత్తగూడెంలో సీఎండీ చేతుల మీదుగా సత్కారం పొందిన సామాని సదానందంతో పాటు ఏరియా పరిధిలోని ఉత్తమ ఉద్యోగులను, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులను, ప్రతిభావంతులైన విద్యార్థులను మునిగంటి శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు మునిగంటి ఉమారాణి సత్కరించారు. అనంతరం సింగరేణి పాఠశాల విద్యార్థులు, కళాకారుల బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీసైదా, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ లక్కాకుల మహేష్, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, కార్మికులు, సేవా సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

**మంచిర్యాల, ఆగస్టు 15 ప్రభాతవార్త**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ ఆర్. ప్రకాష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించి దేశభక్తిని చాటారు. పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేశ స్వాతంత్రం కోసం త్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకున్నారు.

**లక్షెట్టిపేట, ఆగస్టు 15 ప్రభాతవార్త**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లక్షెట్టిపేట పాత బస్టాండ్ ఆవరణలో జాతీయ జెండాను మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షాహిద్ అలీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షాహిద్ అలీ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ, వారి త్యాగాలు, ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని దేశ అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా సంతోషం, ప్రతి కుటుంబంలో అభివృద్ధి, ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, మున్సిపాలిటీ చైర్మన్ దొంత అంజలి నరసయ్య, వైస్ చైర్మన్ మోత్కూరి రాజేశ్వరి వెంకటస్వామి గౌడ్, కౌన్సిలర్స్ చంద్రమౌళి, సత్యనారాయణ, చిన్నయ్య, తోట సువర్ణ రమేష్, పెండెం పద్మరాజు, పర్వీన్ సుల్తానా ఆరిఫ్, కాంగ్రెస్ పార్టీ, కో ఆప్షన్ సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పెట్టెం శ్రీనివాస్, తిరుమలరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్వర్, హాజీ, హఫీజ్, శాంతి కుమార్, జమీరుద్దీన్, మస్రద్, బాబా, ఇసాక్, చోటా లడ్డు, జాకీర్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శ్రీకర్, నమ్ము, సజిల్ అంజిమ్, మేరాజ్, బిలాల్, శ్రీకర్, పోతరాజుల శ్రీనివాస్, రియాజ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ జెండా పతాకావిష్కరణ చేసిన మాజీ శాసనసభ్యులు

**లక్షెట్టిపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త**

80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని లక్షెట్టిపేట పట్టణంలోని ఊట్కూర్ చౌరస్తాలో జాతీయ జెండా పతాకావిష్కరణ మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దివాకర్ జన్మదిన వేడుకలు శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మండల, పట్టణ బిఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు అందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నలమస్ కాంతయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, మాజీ డిసిఎంఎస్ చైర్మన్‌లు కేతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తిప్పని లింగన్న, మండల అధ్యక్షులు చుంచు చిన్నయ్య, కౌన్సిలర్లు పెట్టెను తిరుపతి, జమున కుమార్, షేక్ చాంద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నివాసంలో ఘనంగా వేడుకలు..

**మంచిర్యాల, ఆగస్టు15, ప్రభాతవార్త**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల నియోజకవర్గంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే నివాసం వద్ద మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశభక్తి చాటుతూ.. స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపుతూ.. మువ్వన్నెల పతాకం రెపరెపలాడింది. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ బానేశ్, వైస్ చైర్మన్ జాలే రాయలింగు, జిల్లా ఓబీసీ నాయకులు వొడ్డె రాజమౌళి, ఆత్మ కమిటీ చైర్మన్ సింగతి మురళి, మంచిర్యాల పట్టణ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గజ్జల హేమలత, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**మంచిర్యాల,ఆగస్టు 15, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎనభయ్యవ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాజుల ముఖేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్‌తో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.





జెండా ఆవిష్కరిస్తున్న బిజెపి నాయకులు


ఎమ్మెల్యే నివాసం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



# జర్నలిస్ట్ తుకారామ్ కుటుంబానికి అండగా ఉంటాం



నివాళులు అర్పిస్తున్న టీయూడబ్ల్యూజే నాయకులు

**ఆసిఫాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త :**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేరమెరి మండల సీనియర్ ఆదివాసీ జర్నలిస్ట్, జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ఆత్రం తుకారామ్ అకాల మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. శుక్రవారం రాత్రి తుకారాం హఠాన్మరణం చెందిన విషయం తెలుసుకున్న ఆయన, సంఘం నాయకులతో కలిసి సిర్పూర్ (యు) మండల కేంద్రంలోని తుకారామ్ నివాసానికి శనివారం వెళ్లారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, అంత్య క్రియలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుకారామ్ కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, టీయూడబ్ల్యూజే (ఐజేయూ ) ఎల్లప్పుడూ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ప్రజా సమస్యల పరిష్కారంలో తుకారామ్ పోషించిన పాత్ర, జర్నలిజానికి ఆయన అందించిన సేవలు మరవరానివని కొనియాడారు. తెలంగాణ మీడియా అకాడమీ ద్వారా జర్నలిస్ట్ తుకారామ్ కుటుంబానికి వచ్చే ఎక్స్‌గ్రేషియా అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే ( ఐజేయూ ) జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్, సంఘం నాయకులు తారు, నరేందర్, మేకల శ్రీనివాస్, రాధాకృష్ణ చారి, ఎజాస్ అహ్మద్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పార్థివదేహానికి ఘననివాళి

**కెరమెరి, ఆగస్టు 15 ప్రభాతవార్త:**

సీనియర్ జర్నలిస్టు ఆత్రం తుకారాం శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న నాయకులు అధికారులు ప్రజాప్రతినిధులు పాత్రికేయులు శనివారం సిర్పూర్(యు) మండల కేంద్రంలో జరిగిన అంత్య క్రియలకు హాజరై ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. తుకారాం నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టుగా పనిచేస్తూ, మారుమూల గిరిజన గ్రామాల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ఆదివాసీల గొంతుకను తన కలం ద్వారా సమాజానికి వినిపించడంలో ఆత్రం తుకారాం చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. వార్త కోసం అడవిబాట పట్టి, ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన ఆయన మరణం జర్నలిజం రంగానికి, ఆదివాసీ ప్రాంతానికి తీరని లోటని పేర్కొన్నారు. తుకారాం మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి అంజయ్య

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

**- ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలి..**

**- తాండూర్ మండల ప్రత్యేక అధికారి అంజయ్య**

**తాండూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల స్థాయిలోనే ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి అంజయ్య తెలిపారు. తాండూర్ ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం ఎంపిడిఓ శ్రీనివాస్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వారి సమస్యలను మండల స్థాయిలో సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరించడం వలన ప్రజలకు ప్రయాణ భారం తగ్గడంతో పాటు సమయం కూడా వృథా కాదన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు ప్రజల సమస్యల పరిష్కారం పట్ల నిరక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**బెల్లంపల్లి, ఆగస్టు 15, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాలాపన నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబుతో కలిసి ఎమ్మెల్యే జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే బెల్లంపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలోనూ జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం లభించిందని అన్నారు. దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు. ఆంగ్లేయుల దాస్య శృంఖలాల నుంచి భరతమాత విముక్తి కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావ స్వామి రమేష్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, కౌన్సిలర్లు, బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**బెల్లంపల్లి, ఆగస్టు 15, ప్రభాతవార్త**



బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో 8వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామ సర్పంచ్ చిలుముల శ్రీనివాస్ గ్రామ పంచాయతీలో జెండా ఆవిష్కరించి, అనంతరం పాఠశాలలో విద్యార్థులకు తన అన్న భూమయ్య జ్ఞాపకార్థం 450 నోట్ బుక్‌లను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్రం ఎంతోమంది సమరయోధుల ప్రాణ త్యాగాల వల్ల లభించిందని అన్నారు. మన గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు తోడ్పాటును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గజెల్లి రాజకుమార్, వార్డు సభ్యులు రాచకొండ రజిత, కంపెల గంగ, జాడి అన్నపూర్ణ, ఆవునూరి భాగ్య, రంగ నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ కంపెల చంద్రశేఖర్, సీనియర్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, ఆశా వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభకు పురస్కారం అందుకుంటున్న దృశ్యం

### విధి నిర్వహణలో ప్రతిభకు ప్రశంసలు

**వేమనపల్లి, ఆగస్టు 15, ప్రభాతవార్త**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ. భాస్కర్ చేతుల మీదుగా చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ, నీల్వాయి పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ అబినైజర్, కానిస్టేబుల్ భారత్ కు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విధి నిర్వహణలో చూపిన ప్రతిభ, అంకితభావంతో అందించిన సేవలను గుర్తించి ఈ ప్రశంసా పత్రాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు.





పాఠశాలకు ఎల్ఈడి టీవీ అందజేస్తున్న సర్పంచ్ రవికుమార్

## ప్రభుత్వ పాఠశాలకు ఎల్ఈడి టీవీ విరాళం

**తాండూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం3 ఇంక్లైన్ ప్రభుత్వ పాఠశాలకు స్థానిక సర్పంచ్ చందనాల రవికుమార్ ఎల్ఈడి టీవీని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తులు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశావిద్యార్థుల డిజిటల్ విద్యాభివృద్ధికి సర్పంచ్ ఎల్ఈడి టీవీ ఇవ్వడం అభినందనీయమన్నారు. నేటి ఆధునిక యుగంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కూడా సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అదేవిధంగా మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ పాఠశాల అభివృద్ధి కోసం తన వంతుగా రూ.5000 విరాళం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గంధం లక్ష్మి, హెచ్ఎం సాగర్, స్థానిక ఉప సర్పంచ్ చింతపూరి మల్లేశ్వరి, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగరాజు, తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విష్ణు కళ్యాణ్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, ఉపాధ్యాయులు రేణుక, శేఖర్, బానేష్, అంగన్వాడి టీచర్ సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

### దేశభక్తి చాటిన మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

**మంచిర్యాల,ఆగస్టు15, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కాలనీలో గల తన నివాసం వద్ద ఎనభయ్యవ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్‌రావు శనివారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించి, దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త :**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి శారదాదేవి హాజరై విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం, డ్రగ్స్ దుష్ప్రభావాలు, ట్రాఫిక్ నిబంధనలు, బాలల హక్కులు తదితర అంశాలపై వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని, చట్టం పట్ల గౌరవంతో ముందుకు సాగుతూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 39(ఏ) ప్రకారం ప్రతి పౌరుడికి సమానంగా న్యాయం అందేలా ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మహేష్ బాలల హక్కులు, వారికి అందుబాటులో ఉన్న రక్షణ, సహాయ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలలపై ఎలాంటి వేధింపులు, హింస, అన్యాయం జరిగినా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. న్యాయ సహాయం కోసం నాల్సా హెల్ప్‌లైన్ 15100, అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంకేత్ మిత్ర, జూనియర్ సివిల్ జడ్జి అనంత లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**లక్షెట్టిపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త**

పట్టణంలోని సి ఎస్ ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం రోజు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్.డేవిడ్ పాల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు సామూహికంగా జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ... స్వాతంత్ర దినోత్సవం ప్రాధాన్యత వివరిస్తూ యువతరం దేశం పట్ల ప్రేమను, అభిమానాన్ని కలిగి ఉండాలని తెలిపారు. భారతదేశ ఉజ్వలమైన ప్రగతిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




## ఆస్పత్రి ముందు దివాకర్‌రావు జన్మదిన వేడుకలు

**మంచిర్యాల,ఆగస్టు 15, ప్రభాతవార్త**

మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్‌రావు జన్మదిన వేడుకలను శనివారం మంచిర్యాల పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఆయన నిర్మించిన 450 పడకల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు దివాకర్‌రావు సేవలను కొనియాడుతూ ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

## విధి నిర్వహణలో ఉత్తమ సేవలు

**- సీపీ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్న సీఐ బన్సీలాల్**

**చెన్నూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త**

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు చెన్నూరు సీఐ బన్సీలాల్ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు గాను, ఉన్నతాధికారులు ఆయన సేవలను గుర్తించి, స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని, రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా ఉత్తమ సేవా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐ బన్సీలాల్ మాట్లాడుతూ తన విధి నిర్వహణను గుర్తించి ప్రశంసా పత్రం అందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల సహకారంతో మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అధికారులు, సిబ్బంది సీఐ బన్సీలాల్‌ను అభినందించారు.





## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**జన్నారం, ఆగస్టు 15, ప్రభాతవార్త**

జన్నారం మండల కేంద్రంతో పాటు మండలంలోని 29 గ్రామ పంచాయతీలలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాసిల్దార్ కార్యాలయంలో తహాసిల్దార్ బక్కయ్య, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఉమర్ షరీఫ్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గుర్రపు ఉదయ్ కిరణ్, మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, అటవీశాఖ కార్యాలయంలో ఎఫ్‌డివో రామ్మోహన్, పాక్స్ కార్యాలయంలో చైర్మన్ అల్లం రవి,అగ్నిమాపక కార్యాలయంలో ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆర్యవైశ్య భవనంలో అధ్యక్షుడు జక్కు భూమేష్, వర్తక సంఘం భవనంలో అధ్యక్షుడు వొజ్జల వామన్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు నందు నాయక్,బీజేపీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మధుసూదన్ రావు, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు గుర్రం రాజారామ్ రెడ్డిలు జాతీయ జెండాను ఆవిష్కరించారు.



## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఎంపీవో అవార్డు అందుకున్న ఉమర్ షరీఫ్

**జన్నారం, ఆగస్టు 15, ప్రభాతవార్త**

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను జన్నారం మండల ఉత్తమ ఎంపీవో అవార్డు ను ఉమర్ షరీఫ్ అందుకున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జన్నారం మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న ఆయనకు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ చేతులమీదుగా ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేశారు. ఆయన కృషి, నిబద్ధత,సమన్వయంతో పంచాయతీ పాలనను మెరుగుపరిచిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.ఈ పురస్కారం ఆయన అంకితభావానికి నిదర్శనమని అధికారులు కొనియాడారు.సేవే లక్ష్యంగా పని చేస్తే ప్రజల హృదయాల్లో నిలిచిపోతారు అని అవార్డు స్వీకరించిన సందర్భంగా ఉమర్ షరీఫ్ తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మండల అధికారులు,నాయకులు ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎ

## చెన్నూరు నియోజకవర్గంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**చెన్నూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. చెన్నూరు, కోటపల్లి, జైపూర్, భీమారం మండలాల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి దేశ భక్తిని చాటుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులకు, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. వేడుకల సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్**

**తాండూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ద బోయిన శంకర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న అసత్యపు ఆరోపణలు, విమర్శలను నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడిని నాయకులు సన్మానించారు. ఈ సమావేశంలో పార్టీ మండల ఉపాధ్యక్షులుషేక్ మోమిన్ అలీ, శంకర్, ప్రధాన కార్యదర్శులు నవీన్ పటేల్, కటికల మల్లేష్, మచుకురి సంతోష్, కార్యదర్శులు జైన సాంబయ్య, మాసాడి ప్రభాకర్, రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గాజుల రమేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.


పార్టీ మండల అధ్యక్షుడు పెద్దపోయిన శంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

# ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి

## నూతన డిజిటల్ రేషన్ కార్డులతో ప్రజలకు అన్ని విధాలుగా మేలుం ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**నిర్మల్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**





సోన్ మండలం కడ్తాల్ సమీపంలోని సాగర్ కన్వెన్షన్‌లో శనివారం సాయంత్రం నూతన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ వేముల వీరేశం ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. జిల్లాలో మొత్తం 2,49,313 నూతన డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ రేషన్ కార్డు కేవలం బియ్యం పొందేందుకే కాకుండా, అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నమ్మకమైన గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుందన్నారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బయట అమ్ముకోవద్దని సూచించారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ.. రేషన్ బియ్యం సరఫరాలో కేంద్ర ప్రభుత్వం సహకారం ఉందని, ఈ కార్డులు ఎన్నో సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, డిఆర్డిఓ విజయలక్ష్మి  ్మ, పౌర సరఫరాల అధికారి రాజేందర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యం

## - బారెగూడ సర్పంచ్ కోట వేణుగోపాల్ - బారెగూడలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**కాగజ్‌నగర్ రూరల్,ఆగస్టు 15,ప్రభాతవార్త:**




గ్రామ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో బారెగూడలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ కోట వేణుగోపాల్ ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.కాగజ్‌నగర్‌లోని ఐకేర్ నేత్ర వైద్య కేంద్రం, కాగజ్‌నగర్ కొత్తపేట లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత కంటి చుక్కల మందులు అందించారు. శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. అవసరమైన వారికి కేవలం రూ.600కే నాణ్యమైన బ్రాండెడ్ కళ్లద్దాలను అందుబాటులో ఉంచారు.ఈ సందర్భంగా సర్పంచ్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. నేత్ర వైద్య శిబిరం ఏర్పాటుకు సహకరించిన శ్రీ విజన్ వ్యవస్థాపకులు రెడ్డి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి కంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.గ్రామ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను బారెగూడలోనే అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు. కంటి సమస్యలను నిరక్ష  ్యం చేయకుండా ప్రతి ఒక్కరూ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉపసర్పంచ్ నేరెళ్ల వెంకటేష్, ట్రస్ట్ సభ్యులు డా. దిలీప్ కుమార్, అనిల్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సావర్‌ఖేడ్ గ్రామపంచాయతీకి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేత

**ఆసిఫాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త :**



కేరమేరి మండలం సావర్‌ఖేడ్ గ్రామపంచాయతీకి ఐఎస్ఓ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్ లభించింది. శనివారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్లో 80వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, జిల్లా కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విట్టల్, ఎమ్మెల్యే కోవలక్ష్మి చేతుల మీదుగా ఆ గ్రామపంచాయతీ సర్పంచ్ తులసి రామ్ ఉప సర్పంచ్ దేవుడు రావ్ , కార్యదర్శి వాజీద్ కు కలిసి అందుకున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన ఈ పంచాయతీ సేవలు అందించడం, పారిశుధ్య నిర్వహణ, గ్రామ పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు గుర్తింపుగా ఈ సర్టిఫికెట్ అందజేశారు. ఐఎస్ఓ (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్) ప్రమాణాలకు అనుగుణంగా గ్రామపంచాయతీ సేవలను నిర్వహించడం, ప్రజలకు సత్వర సేవలు అందించడం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ గుర్తింపు లభించినట్లు తెలిపారు. గ్రామపంచాయతీకి హెచ్ వై ఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ సర్టిఫికెట్ రావడం గ్రామానికి గర్వకారణమని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులకు అభినందనలు తెలిపారు.

# రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

**ఆసిఫాబాద్, ఆగష్టు 15, ప్రభాతవార్త :**



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ హరిత,ఎమ్మెల్యే కోవ లక్ష్మి గ్రంథాలయం శాఖ జిల్లా చైర్మన్ అనిల్, మున్సిపల్ చైర్మన్ ఆకాష్ పాల్గొని లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా, పారదర్శకంగా అందించడంలో స్మార్ట్ రేషన్ కార్డులు కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## మండలంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**వేమనపల్లి, ఆగస్టు 15, ప్రభాతవార్త**

మండల కేంద్రంతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కుమారస్వామి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సాయికృష్ణ, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నాగరాజు, నీల్వాయి సబ్‌స్టేషన్‌లో ఏఈ దీక్షిత్, ఎంఈవో కార్యాలయంలో శ్రీధర్‌రెడ్డి, పీహెచ్‌సీలో డా. అన్వేష్, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకుడు గాలి మధు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొని స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించుకున్నారు.



## స్వాతంత్ర్య ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి

### - బెల్లంపల్లి ఏరియా జిఎం శ్రీరమేష్

**తాండూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త :**

ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్య ఫలాలను ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీరమేష్ అన్నారు. గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయంలో శనివారం80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను జిఎం ఎగరవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిఎం మాట్లాడుతూ..సింగరేణి యాజమాన్యం ప్రభావిత గ్రామాల్లో సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గోలేటి టౌన్ షిప్ లో రూఫ్ టాప్ సౌర విద్యుత్ పనులు త్వరలో పూర్తికానున్నాయన్నారు.ఉత్పత్తి సాధనలో ప్రతిభ చూపి ఉత్తమ ఉద్యోగులను, ఉత్తమ విద్యార్థిని సన్మానించారు. అనంతరం సింగరేణి స్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి తిరుపతి, సీఎంవోఏఐ అధ్యక్షుడు నరేందర్, ఎస్ఓటు జీఎం రాజమల్లు, గోలేటి పిఓ ఎన్ ఉమాకాంత్, ఏరియా ఇంజినీర్ వీరన్న, డీజీఎం పర్సనల్ దేవరకొండ కిరణ్ బాబు, డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహరా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్ , సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్, ఈఈ సివిల్ క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

**పెంచికల్ పేట్, ఆగస్ట్ 15, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని ఎల్కపల్లి పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో శనివారం బాలికలకు రైఫిల్ షూటింగ్ గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ భువనేశ్వరి అవగహన కల్పించారు. సమాజంలోని సవాళ్లను ఎదుర్కొంటూ ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ చైల్డ్ అబ్యూస్ పై అవగహన కల్పించారు. అనంతరం పదవ తరగతిలో మండల టాపర్ నిలిచినా జాడి మోనికకు సర్పంచ్ భక్తు రాంచంధర్ రూ. 5 వేలు బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయ నిర్మల, ఉపాధ్యాయ సిబ్బంది, భాస్కర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




భువనేశ్వరిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు